క్లుప్తంగా

పుస్తక పఠనం అలవర్చుకోండి



పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

కనగానపల్లి: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మండల గ్రంథాలయ అధికారి గోవిందు సూచించారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, యోగాపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాల ఆవశ్యకత, పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం యోగా గురువు సుబ్బరాయుడు యోగాసనాలపై విద్యార్థులకు శిక్షణ అందించారు. యోగా వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక సామర్థ్యం కూడా పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



108 వాహనంలో క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందిస్తున్న సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: బుక్కపట్నం మండలం సిద్దరాంపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది ఈఎంటీ బాలయ్య, పైలెట్ శ్రీనివాసులు వివరాలమేరకు... బుక్కపట్నం మండలం ధూపంపల్లికి చెందిన నారాయణస్వామి సోమవారం ద్విచక్ర వాహనంపై స్వంత పని మీద బుక్కపట్నంకు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. అపస్మారక స్థితిలో పడివుండగా స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108లో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు పేర్కొన్నారు. నారాయణస్వామి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిపారు.

అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు ఎంపిక



నిశ్చయ్

కదిరి అర్బన్: ఆంధ్రా క్రికెట్‌సంఘం ఆధ్వర్యంలో అనంతపురంలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న దక్షిణ మండల అండర్ -19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు కదిరి క్రీడాకారుడు నిశ్చయ్ ఎంపికైనట్లు ఆర్డీటీ క్రికెట్ కోచ్ నజీర్ తెలిపారు. అలాగే కడపలో ప్రారంభం కానున్న సీనియర్స్ దక్షిణ మండల క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు గిరినాథ్‌రెడ్డి, సంపత్ కుమార్, సంతోష్ ఎంపికయ్యారన్నారు.

కోలాహలంగా చిన్నమ్మ ఊరేగింపు

నల్లమాడ: పసిబాల చిన్నమ్మ పరుష మహోత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారి ఊరేగింపు కోలాహలంగా సాగింది. బసిరెడ్డిపల్లి సమీపంలోని నీళ్ల బావి వద్ద పూజారులు అక్కదేవతలకు పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన గంపలో ఉరుము వాయిద్యాలతో చిన్నమ్మ దేవతను ఊరేగింపుగా వంకరకుంట గ్రామ సమీపంలోని సోమగుట్ట వారి బావి వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాత్రికి పరుష జరిగే చిన్నమ్మ తోపులోని గుడిలో అమ్మవారిని కొలువుదీర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బసిరెడ్డిపల్లి, వంకరకుంట, సానేవారిపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లల గుర్తింపునకు సర్వే



సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నల్లచెరువు: సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సహిత విద్యా సమన్వయకర్త ఆనంద్ బాబు, మండల విద్యాశాఖ అధికారులు తిరుపాల్ నాయక్, చెన్న కేశవులు ఆధ్వర్యంలో మండలంలోని దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వేని ఉపాధ్యాయులు నరసింహులు, వినయ్ సోమవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జూన్ 11వ తేదీ లోపు 18 సంవత్సరాల్లోపున్న దివ్యాంగ పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు సమగ్ర శిక్షా ద్వారా అందించే లబ్ధిని వివరిస్తున్నామన్నారు. 6 సంవత్సరాల్లోపు ఉన్న దివ్యాంగ పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు 502772336,8297012001 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రణాళికతో సాగు.. పంట బాగు

- ముందస్తు జాగ్రత్తలతో నష్టాలను అధిగమించవచ్చు
- మండల వ్యవసాయశాఖ అధికారి లోకేశ్వర్‌రెడ్డి





విత్తన సాగుకు పొలం సిద్ధం చేస్తున్న రైతు

ఎన్‌పీకుంట: ముందస్తు ప్రణాళికతో పంటలు సాగు చేస్తే దిగుబడి దక్కుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి లోకేశ్వర్‌రెడ్డి రైతులకు సూచిస్తున్నారు. జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండటంతో పంటల సాగుపై ఆయన పలు సూచనలు ఇచ్చారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా సుమారు 10 నుండి 12 వేల ఎకరాలలో వేరుశనగ సాగయ్యే అవకాశం ఉంది. ముందస్తుగా వర్షాలు కురవడంతో పాటు, సకాలంలో ప్రభుత్వం నుండి వేరుశనగ విత్తన కాయలు అందనుండటంతో ఇది వరకే లోతు దుక్కులు చేసుకున్న రైతులు సాగుకు సిద్ధం అవుతున్నారు.

భూసారాన్ని బట్టి పంట వేసుకోవాలి

ఖరీఫ్‌కు ముందే ప్రతి రైతు తమ భూమిలో భూసార పరీక్ష చేయించుకుంటే బాగుంటుంది. భూసారాన్ని బట్టి అనుకూలమైన పంటలను మాత్రమే వేసుకోవాలి. దీని వల్ల రైతులకు పెట్టుబడి తగ్గి, దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. భూసారానికి అనుగుణంగా ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలి. అలాగే రైతులు అంతర, సరిహద్దు పంటలపై దృష్టి సారించాలి.

విత్తన శుద్ధి..

పంటల సాగులో నాణ్యమైన విత్తన ఎంపిక, విత్తన శుద్ధి కీలకం. పంటల సాగు కోసం రైతులు వివిధ ప్రాంతాల నుంచి విత్తనాలను సేకరిస్తారు. ఈ విత్తనాల ద్వారా శిలీంద్రాలు, బ్యాక్టీరియా, పురుగులు పంట మొలకెత్తినప్పుడు ఆశించి నష్టం చేకూర్చుతాయి. అంతేకాకుండా విత్తనం ద్వారా వ్యాపించి తెగుళ్లలో మొలక శాతం తగ్గి శిలీంద్రాల వలన పంట కుళ్లి పోయే అవకాశం ఉంది. విత్తన శుద్ధి వలన ప్రారంభ దశలో తెగుళ్లు, వ్యాధుల బారిన పడకుండా ఈ ప్రక్రియ ఒక రక్షణ కవచంగా పని చేస్తుంది. కాబట్టి పంటల సాగుకు ముందే విత్తన శుద్ధి చేయించుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు.

సేంద్రియం మంచిది

ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలి. ఎక్కువగా రసాయన ఎరువుల వాడకం వల్ల పంట దిగుబడిలో పలు సమస్యలు ఎదురవుతాయి. పశువుల ఎరువులు, వర్మి కంపోస్టు ఎరువుల ద్వారా భూసారం పెరగడంతో పాటు నాణ్యమైన దిగుబడిని కూడా సాధించవచ్చు.

మోతాదులోనే ఎరువులు వాడాలి

రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులను సరిగ్గా పాటించాలి. భాస్వరం, ఎరువులను దుక్కిలో వేసుకోవాలి. నత్రజని, ఎరువులను విడతల వారిగా వేసుకోవాలి. పంటకు వేయాల్సిన పొటాషియాన్ని సగం దుక్కిలో వేయాలి. సగం పంటకు వేయాలి. యూరియాను నేరుగా కాకుండా వేప పిండితో కానీ, బంక మట్టితో కానీ కలిపి వేయాలి. ఇలా వేసుకున్నట్లయితే యూరియా ఆవిరి కాకుండా ఉండటంతో పాటు 100 శాతం పంటకు ఉపయోగపడుతుంది.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ మాధవరెడ్డి



బాధిత కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: వివిధ కారణాలతో మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రానాయక్ గత నెలలో గుండెపోటుతో మృతి చెందారు. ఇందులో భాగంగానే చంద్రానాయక్ భార్య శాంతమ్మకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో తన చాంబర్‌లో ఎస్పీ మాధవరెడ్డి విడో ఫండ్ కింద రూ.50 వేల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. బాధిత పోలీస్ కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శాఖాపరంగా రావాల్సిన ప్రయోజనాలకు త్వరగా అందజేసేవిధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఓ భాగ్యరేఖ

- పుట్టపర్తి ఆర్‌ఓ భాగ్యరేఖ



శిక్షణలో పాల్గొన్న అబ్జర్వర్లు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు

పుట్టపర్తి అర్బన్: జూన్ 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం నియమించబడిన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్లకు ఓట్ల లెక్కింపుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నియోజక వర్గంలో ఆరు మండలాలు ఉండగా అందులో 241 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. మొదట కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి రూరల పుట్టపర్తి అర్బన్, నల్లమాడ, ఓడీ చెరువు, అమడగూరు మండలాల వారీగా కౌంటింగ్ జరుగుతుందని చెప్పారు. కౌంటింగ్ నిమిత్తం 14 టేబుళ్లు, 18 రౌండ్లు ఉంటాయన్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లు, సర్వీస్ ఓట్లు, లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో పాటు 8.30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్ జరుగుతుందన్నారు. కౌంటింగ్‌లో రౌండ్ల వారీగా ఫారం 17-సీ పార్ట్-2లో వివరాలను నమోదు చేయాలన్నారు. అనంతరం అభ్యర్థులు, ఏజెంట్ల సంతకాలు తీసుకొని ఆర్‌ఓకు, అబ్జర్వర్‌కు పంపాలన్నారు. అనంతరం వివరాలను బ్లాక్ బోర్డులో నమోదు చేస్తారన్నారు. అనంతరం ఈవీఎంలను సీల్ వేసి స్ట్రాంగ్ రూంకు పంపుతారన్నారు. లేపాక్షి సమీపంలోని గురుకుల పాఠశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 7 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వేణుగోపాల్, భారతి, నాగభూషణ, రామనాథరెడ్డి, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వివిధ పార్టీల నాయకులతో...

ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ భాగ్యరేఖ మాట్లాడుతూ ప్రతి పార్టీ తరఫున కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. 14 టేబుళ్లకు 14 మందిని నియమించాలన్నారు. స్ట్రాంగ్ రూం విజిట్ ఉదయం 10 నుంచి 11 గంటల వరకూ, సాయంత్రం 3 నుండి 4 గంటల వరకూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జన్మదినం



వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ప్రశాంతి నిలయం/పుట్టపర్తి అర్బన్/నల్లమాడ/ఓడీచెరువు: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకను పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కర్ణాటక నాగేపల్లి, ఎనుములపల్లిలలో ఉన్న ఆశ్రమాల్లో వృద్ధులు, చిన్నారులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, జిల్లా వ్యవసాయ సలహా మండలి సలహాదారు అవుటాల రమణారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, కొత్తచెరువు మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, గోరంట్ల జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, కౌన్సిలర్లు చెరువు భాస్కర్‌రెడ్డి, సూర్యగౌడ్, సాయిగీత, రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీలరెడ్డి, జిల్లా కార్యదర్శి కవితరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ తిరుపాల్ నాయక్ , వైఎస్సార్‌సీపీ నాయకులు నర్సారెడ్డి, మాధవరెడ్డి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- పుట్టపర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, సుదర్శనరెడ్డి, బాబుల్‌రెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మధు తమిళనాడు రాష్ట్రం ఊటీలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జన్మదినాన్ని జరుపుకున్నారు. అక్కడున్న తెలుగువారు సైతం వేడుకల్లో పాల్గొన్నారు.
- నల్లమాడ మండలం తిప్పయ్యగారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. హరినాథరెడ్డి, పోలే మహేశ్వర్‌రెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌కు వెళ్లి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన చేత కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు.
- ఓడీచెరువు మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకను నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. జెడ్పీటీసీ సభ్యుడు కుర్లి దామోదర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ళ కృష్ణారెడ్డి , అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనందరెడ్డి, యూత్ కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, సర్పంచులు గోవిందు, జగన్‌మోహన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



తిప్పయ్యగారిపల్లి నాయకులతో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఆకట్టుకున్న పోలీసుల మాక్‌డ్రిల్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

కదిరి టౌన్: ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న జరిగే సాధారణ ఎన్నికల కౌటింగ్ దృష్ట్యా డీఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో కదిరి సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న సుమారు 100 మంది పోలీసులకు ఏఆర్ పోలీసుల సాయంతో సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో పోలీస్ మాక్ డ్రిల్ నిర్వహించారు. 144 సెక్షన్‌తో పాటు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నపుడు ప్రజలు గుంపులుగా ఉన్నా, సమావేశాలు నిర్వహించినా, ధర్నాలు, నిరసనలు, ఉత్సవాలు చేయడం చట్టరీత్యా నేరమని డీఎస్పీ శ్రీలత తెలిపారు. కౌటింగ్ రోజు గుంపులుగా చేరి సమస్య సృష్టించే వారిని పోలీసులు ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియజేసేందుకు మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. నిరసలను చెదరగొట్టే క్రమంలో పోలీసులు గుంపులుగా ఉన్న ప్రజలకు మొదట మైకు ద్వారా హెచ్చరికలు జారీ చేస్తామన్నారు.గుంపులు చెదరిపోని పక్షంలో భాష్పవాయువు ప్రయోగించడంతో పాటు లాఠీచార్జి చేస్తామన్నారు. అయినా గుంపులు చెదరక పోతే శాంతిభద్రతలు పరిరక్షణలో భాగంగా చివరగా పోలీసులు కాల్పులు జరిపి ప్రజల ధన,మాన,ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మాక్ డ్రిల్‌లో పట్టణ సీఐ కె.పుల్లయ్య, కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, అప్‌గ్రేడ్ రూరల్ సీఐ మోహన్, పట్టణ ఎస్‌ఐలు బాబ్జాన్, బలరామ్,స్పెషల్ పార్టీ పోలీసులు, ఏఆర్ పోలీసులు, కదిరి సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డుకు రూ.50 వేల చెక్కు అందజేత



మల్లికార్జునకు చెక్కు అందజేస్తున్న సీఐ హేమంత్

కదిరి టౌన్/పుట్టపర్తి టౌన్: కుప్పంలో గంగమ్మ జాతర బందోబస్తుకు వెళ్లిన కదిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు మల్లికార్జున కారు ఢీకొని గాయపడ్డాడు. ప్రస్తుతం శస్త్ర చికిత్స పొంది ఇంటివద్ద ఉన్నాడు.విషయం తెలుసుకున్న శ్రీసత్యసాయి జిల్లా సైబర్ క్రైమ్ విభాగం సీఐ జె.హేమంత్‌కుమార్ తన వంతు సాయంగా హోంగార్డుకు రూ.50 వేల చెక్కును అందజేశారు. హోంగార్డు కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో పారిశ్రామికవేత్త మృతి



హరినాథ్ (ఫైల్)

నల్లచెరువు: మండలంలోని ప్రముఖ పారిశ్రామిక వేత్త పడుచూరి హరినాథ్(55) గుండె పోటుతో బెంగుళూరులోని ఒక ఆస్పత్రిలో మృతి చెందినట్లు మృతుని కుటుంబ సభ్యులు సోమవారం తెలిపారు. మండల కేంద్రంలో మిల్లు స్థాపించి వందల కుటుంబాలకు ఆయన ఉపాధి కల్పించారు. అలాగే ఆయన మండలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మృతిపై పలువురు ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు.

ఓట్ల లెక్కింపులో నిర్లక్ష్యం వహించొద్దు



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి

ధర్మవరం రూరల్: జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో నియోజక వర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లోని కౌంటింగ్ అసిస్టెంట్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులకు ఓట్ల లెక్కింపుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలను, సూచనలను వారికి వివరించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు తదుపరి ఈవీఎం ఓట్ల లెక్కింపుపై అవగాహన కల్పించారు. 4వ తేదీ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా అసెంబ్లీకి 14, పార్లమెంట్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్కడ ఎటువంటి తప్పులు, పొరపాట్లుకు తావివ్వకుండా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన వెంకటరెడ్డి సోమవారం సాయంత్రం ఇంటి సమీపంలోని ఖాళీ ప్రదేశంలో విషద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటరెడ్డి పవర్‌లూమ్స్ మగ్గం నేస్తాడు. ఇంకా పెళ్లికాలేదు. వెంకటరెడ్డి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

సిద్దయ్యగుట్టలో..

పట్టణంలోని సిద్దయ్యగుట్టకు చెందిన దూద్‌వలి అనారోగ్యం కారణంతో మనస్థాపానికి గురై సోమవారం సాయంత్రం కూరగాయల మార్కెట్ వద్ద విషద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌గా పని చేస్తున్న దూద్‌వలికి ఇంకా పెళ్లి కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చెన్నేకొత్తపల్లి/బత్తలపల్లి/ముదిగుబ్బ/కదిరి టౌన్: శాంతిభద్రతలకు విఘాతం కలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు గ్రామస్తులను హెచ్చరించారు. జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రజలు అనవసరంగా గొడవలకు వెళ్లొద్దని సూచించారు. సోమవారం ఉదయం మండలంలోని కనుముక్కల గ్రామంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అలాగే మండలంలోని వెంకటగారిపల్లి గ్రామంలో సిబ్బందితో కలసి ఎస్‌ఐ పి.శ్రీనివాసులు కార్డన్ సెర్చ్‌తో పాటు, ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అదేవిధంగా ముదిగుబ్బ మండల పరిధిలోని ఎనుములవారిపల్లిలో సోమవారం పట్నం ఎస్‌ఐ నరసింహులు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. అలాగే కదరిలోని దేవాలయ బజారులో ఉన్న కిషోర్ ఇంట్లో రెండు బాక్సుల టపాసులను సీజ్ చేసినట్లు సీఐ పుల్లయ్య తెలిపారు.

రుచికరమైన భోజనం అందించాలి

బత్తలపల్లి: పాఠశాల విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని మండల విద్యాశాఖ అధికారులు చాముండేశ్వరి, సుధాకర్ నాయక్ అన్నారు. పాఠశాలల్లో అమలు జరుగుతున్న గోరుముద్ద పథకంపై మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వహకులు, సహాయకులకు సోమవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా రీసోర్స్ పర్సన్ రాణి మాట్లాడుతూ.. ఏజెన్సీ నిర్వహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మెనూలో ఉన్న పులిహోర, తీపు అన్నం (స్వీట్ పొంగల్), కాయగూరల అన్నం (వెజిటబుల్ పలావు) తయారు చేయడంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది, ఆయా పాఠశాలల ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నోటీసుల అందజేత



అటవీ భూములు సాగు చేస్తున్న రైతుకు నోటీసులు అందిస్తున్న అటవీశాఖ అధికారులు

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో రిజర్వ్ ఫారెస్టు భూములను సాగు చేస్తున్న పలువురు రైతులకు సోమవారం అధికారులు నోటీసులు ఇచ్చారు. చిల్లవారిపల్లి అటవీశాఖ పరిధిలో వైఎస్సార్ జిల్లా, లింగాల మండలం, పార్నపల్లి గ్రామానికి చెందిన మురుసు శ్రీనివాసులు నాయుడు గత కొన్నేళ్లుగా 5.5 ఎకరాలు, దాడితోట గ్రామానికి చెందిన జొన్నగడ్డ లంగయ్య 2 ఎకరాలు, దోసలేడు కృష్ణారెడ్డి 50 సెంట్లు, కోనప్పగారి నగేష్ 75 సెంట్లు, చిల్లవారిపల్లి గ్రామానికి చెందిన అంద్ర శివారెడ్డి ఒక ఎకరా, ఆంద్ర వెంకటరమణారెడ్డి 75 సెంట్లు, నాయానపల్లి గ్రామానికి చెందిన దండు మల్లికార్జున, దండు సూర్యనారాయణ, దండు చిన్న యల్లప్ప, జడే గంగయ్య, దండు యల్లప్పలు తలా 50 సెంట్లు, యలమకూరి బయన్న ఎకరా, యలమకూరి వెంకటరాముడు 75 సెంట్లు భూములను సాగు చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా డీఎఫ్‌ఓ డీ.రవీంద్రానాథ్‌రెడ్డి, ఎఫ్‌ఆర్‌ఓ ఈజీ శ్రీనివాసులురెడ్డి ఆదేశాల మేరకు దాడితోట బీట్ ఆఫీసర్ సీ.సూర్యనారాయణ, గంగినేపల్లి బీట్ ఆఫీసర్ కే.సేనంద తదితర అటవీశాఖ అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి రైతులకు నోటీసులు ఇచ్చారు. 15 రోజుల్లోగా మీరు సాగు చేస్తున్న భూములకు అటవీశాఖ అనుమతి పత్రాలు కాని లేదా ఇతర ఆధారాలను తీసుకుని పుట్టపర్తిలో అటవీశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో దర్శనమల, కొండకమర్ల, గంగిరెడ్డిపల్లి బీఎఫ్‌ఓలు డీ.అక్కులప్ప, జీ.రామకృష్ణ, కే.రాహుల్, గంగినేపల్లి ఏఎఫ్‌ఓ టీ.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను బడుల్లో చేర్చండి



మాట్లాడుతున్న జిల్లా సహిత కో-ఆర్డినేటర్ ఆనంద్‌బాబు

బత్తలపల్లి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. అక్కడ వారికి అన్ని వసతులు కల్పిస్తామని శ్రీసత్యసాయి జిల్లా సహిత కో-ఆర్డినేటర్ అలెస్కో ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పోట్లమర్రిలో వికలాంగ పిల్లల గుర్తింపు సర్వేను పర్యవేక్షించారు. ఎస్కార్ట్ ట్రాన్సుపోర్టు లేడీస్ స్టైయిఫెండ్, అమ్మఒడి, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, బూట్లు మొదలైనవి లభిస్తాయన్నారు. భవితా సెంటర్లలో ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, ఉపకరణాలు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. మండలంలో ఇంత వరకు గుర్తించిన 225 మందితో పాటు కొత్తగా 42 మందిని గుర్తించారని తెలిపారు. వీరిని వయస్సు తగినట్లు ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీల్లో చేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్, ఐఈఆర్‌పీలు ప్రసాద్, ఖాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.